జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
గురువారం
06-08-2026
సంపుటి 1 సంచిక 254
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195





4లో

# పెట్రోల్, డీజిల్ బంద్?



ఆర్టీఐలో 'అక్రమాలు లేవు'

# కళ్లముందు భారీ షెడ్లు!

## బాటసింగారం గ్రామపంచాయతీ సమాధానంపై అనుమానాలు..

## వాస్తవాలను దాచిపెడుతున్నారా?

**దశ, రంగారెడ్డి ప్రతినిధి:** రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం గ్రామపంచాయతీ పరిధిలో భారీ షెడ్లు, వాణిజ్య నిర్మాణాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద గ్రామపంచాయతీ నుంచి వచ్చిన సమాచారం మేరకు "అనుమతులు లేకుండా నిర్మాణాలు జరిగినట్లు గ్రామపంచాయతీ రికార్డుల్లో సమాచారం లేదు. అందువల్ల ఎలాంటి నోటీసులు జారీ చేయలేదు" అని పేర్కొనడం చర్చనీయాంశంగా మారింది. క్షేత్రస్థాయిలో భారీ నిర్మాణాలు కనిపిస్తున్న

..మిగతా 4వ పేజీలో →



# ఢిల్లీలో సీఎం రేవంత్

## తెలంగాణ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ కోరుతూ కేంద్ర మంత్రులతో కీలక భేటీ

**దశ, న్యూఢిల్లీ:** తెలంగాణకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టులకు కేంద్ర అనుమతులు త్వరగా మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఢిల్లీలో కేంద్ర మంత్రులతో వరుసగా సమావేశమై విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో కలిసి కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌లను కలిశారు. పాలమూరు-రంగారెడ్డి, గౌరవెల్లి, సీతమ్మసాగర్, డిండి ఎత్తిపోతల ప్రాజెక్టులకు పెండింగ్‌లో ఉన్న పర్యావరణ అనుమతులను తక్షణమే మంజూరు చేయాలని ముఖ్యమంత్రి కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి భూపేందర్ యాదవ్‌ను కోరారు. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన సానుకూల తీర్పు నేపథ్యంలో ఇక అనుమతుల ప్రక్రియను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై రూ.36,437 కోట్లు, డిండి ఎత్తిపోతల పథకంపై రూ.3,187 కోట్లు, సీతమ్మసాగర్ ప్రాజెక్టుపై రూ.1,835 కోట్లు, గౌరవెల్లి ప్రాజెక్టుపై రూ.1,350 కోట్లు ఖర్చు చేసిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అనుమతుల జాప్యం కారణంగా పనులు నిలిచిపోవడంతో ప్రాజెక్టుల వ్యయం రోజురోజుకూ పెరుగుతోందని వివరించారు. అనంతరం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశమైన ముఖ్యమంత్రి, ప్రాణహిత నదిపై నిర్మించనున్న తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపునకు మహారాష్ట్ర అనుమతి ఇప్పించాలని కోరారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 148 మీటర్ల ఎత్తు కంటే 150 నుంచి 152 మీటర్ల వరకు ఎత్తు పెంచితే గ్రావిటీ ద్వారా నీటి సరఫరా సాధ్యమవుతుందని వివరించారు. దీంతో విద్యుత్ వినియోగ భారం తగ్గి ప్రాజెక్టు మరింత ప్రయోజనకరంగా మారుతుందని తెలిపారు. పుణెలోని సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ సెంటర్ (CWPRS) అధ్యయనం ప్రకారం 148 మీటర్లు, 152 మీటర్ల ఎత్తుల మధ్య ముంపు ప్రభావంలో

..మిగతా 4వ పేజీలో →

ర్యాపిడోలో పోలీస్

# పెట్రోలింగ్ వాహనం

## వైరల్ వీడియోపై విచారణ

**దశ, హైదరాబాద్:** శాఖాపరమైన విధులకు, అత్యవసర పెట్రోలింగ్‌కు ఉపయోగించాల్సిన పోలీస్ మొబైల్ వాహనం ఒక రైడ్ షేరింగ్ యాప్‌లో ప్రత్యక్షమై సాధారణ ప్రయాణికుడికి రవాణా సేవలు అందించడం సంచలనంగా మారింది. ఓ పౌరుడు స అనుమానంతో ర్యాపిడో యాప్‌లో బైక్ బుకింగ్ చేయగా, ఆయనను పికప్ చేసుకోవడానికి ఏకంగా పోలీస్ అధికారిక పెట్రోలింగ్ వాహనం వచ్చి ఆగింది. ఈ వింత పరిణామానికి ఆశ్చర్యపోయిన సదరు కస్టమర్, పికప్ పాయింట్ నుంచి డ్రాప్ లోకేషన్ వరకు ప్రయాణాన్ని తన స్మార్ట్‌ఫోన్‌లో వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది క్షణాల్లో వైరల్‌గా మారింది.ఈ వైరల్ వీడియో క్లిప్‌లో సదరు ప్రయాణికుడు పోలీస్ వాహనంలో వెళ్తుండగా, డ్రైవింగ్ సీట్లో ఉన్న వ్యక్తి సాధారణ ప్రయాణాన్ని సాగిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోంది. ప్రజా రక్షణకు, అత్యవసర సేవలకు వినియోగించే ప్రభుత్వ వాహనాలు ప్రైవేట్ యాప్‌లలో కమర్షియల్ రైడింగ్ కోసం ఎలా అందుబాటులోకి వచ్చాయనే అంశంపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులు, ఇంధనం దుర్వినియోగం కావడంపై నెటిజన్లు రకరకాల కామెంట్లతో నిరసన వ్యక్తంచేస్తున్నారు.అయితే, ఈ వాహనం వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందినదా లేదా కరీంనగర్ కమిషనరేట్

..మిగతా 4వ పేజీలో →



ఆగస్టు 10 వరకు

# ఎస్ఐఆర్‌కు గడువు

4లో

వెంటనే ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించండి: కలెక్టర్




# 60 లక్షల ఓట్లు తొలగింపు?

**దశ, హైదరాబాద్:**తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా సుమారు 60 లక్షల ఓట్లు తొలగించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే సుమారు 40 లక్షల మంది తమ నమోదిత చిరునామాల్లో అందుబాటులో లేరని గుర్తించినట్లు సమాచారం. అలాగే మరణించిన వారు, ఇతర రాష్ట్రాల్లో కూడా ఓటు ఉన్నవారు, రెండు లేదా మూడు చోట్ల ఓటు నమోదు చేసుకున్న వారు కలిపి మరో 20 లక్షల మంది ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియ పూర్తయిన తర్వాత తుది ఓటర్ల జాబితాలో భారీ మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది.

హైడ్రా చీఫ్

# సంతకం ఫోర్జరీ

## 8 జూనియర్ కాలేజీలపై కేసు






**దశ, హైదరాబాద్:** హైడ్రా కమిషనర్ రంగనాథ్‌తో పాటు ఇతర అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి నకిలీ ఫైర్ ఎన్‌ఓసీ (NOC) సర్టిఫికెట్లు సమర్పించిన వ్యవహారం హైదరాబాద్‌లో సంచలనం సృష్టించింది. ఈ ఫేక్ పత్రాల ఆధారంగా ఇంటర్మీడియట్ బోర్డు నుంచి అనుమతులు పొందేందుకు నగరంలోని ఎనిమిది ప్రముఖ ప్రైవేటు జూనియర్ కాలేజీలు ప్రయత్నించినట్లు అధికారులు గుర్తించారు. హైడ్రా, ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు పత్రాలను పరిశీలించగా సర్టిఫికెట్లు నకిలీవని, కమిషనర్ సంతకాలు ఫోర్జరీ చేసినట్లు తేలింది. దీంతో హైడ్రా అడిషనల్ డైరెక్టర్లు సంబంధిత కాలేజీల గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ లేక్ పోలీస్ స్టేషన్‌లో అధికారిక ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ఫోర్జరీ వెనుక ఉన్న ముఠాపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ వ్యవహారంలో శ్రీ చైతన్య (చాంద్రాయణగుట్ట), రెసోనెన్స్ (ఎస్ఆర్ నగర్),

..మిగతా 4వ పేజీలో →




# కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య 'క్షుద్ర పూజల' రచ్చ

**దశ, హైదరాబాద్:** తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు 'క్షుద్ర పూజలు' అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు ఇటీవల కుటుంబంతో కలిసి పలు పుణ్యక్షేత్రాలను సందర్శించడంపై కాంగ్రెస్ నేతలు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆధ్యాత్మిక యాత్ర పేరుతో క్షుద్ర పూజలు నిర్వహించి కాంగ్రెస్ ప్రభుత్వానికి కీడు కలిగించాలని ప్రయత్నించారని కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను చూసి ఓర్వలేక బీఆర్ఎస్ నేతలు క్షుద్ర పూజలకు పాల్పడుతున్నారని విమర్శించారు. హరీష్ రావు ఎక్కడికి వెళ్లారు, ఎవరిని కలిశారు అన్న వివరాలు తమ వద్ద ఉన్నాయని కూడా పేర్కొన్నారు. ఈ ఆరోపణలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండించింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించేందుకే ఇలాంటి నిరాధార ఆరోపణలు చేస్తోందని హరీష్ రావు వర్గం మండిపడింది. తనపై చేసిన వ్యాఖ్యలు పరువు నష్టం కలిగించేలా ఉన్నాయని పేర్కొంటూ కాంగ్రెస్ నాయకులకు హరీష్ రావు ఇప్పటికే లీగల్ నోటీసులు పంపారు.

ఆరోపణలను ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని, లేకుంటే పరువు నష్టం దావా వేస్తామని నోటీసుల్లో హెచ్చరించారు. ఈ పరిణామాలతో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ విమర్శలు మరింత ముదిరాయి. క్షుద్ర పూజల ఆరోపణలపై ఇరు పార్టీల నేతలు పరస్పరం విమర్శలు చేసుకుంటుండగా, ఈ వివాదం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

మూడేళ్లలో ఒక్క ప్రాజెక్టుకు కూడా అనుమతి

# తీసుకురాలేదు

## బీఆర్ఎస్ నేత హరీశ్



**దశ, హైదరాబాద్:** ఈనెల 18న హైదరాబాద్‌లో జరగనున్న జీఆర్ఎంబీ (GRMB) సమావేశంలో తెలంగాణ ప్రయోజనాలను ప్రభుత్వం గట్టిగా వినిపించాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం మౌనం వీడకపోవడంతో ఈ సమావేశం కేవలం ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాల కోసమే జరుగుతోందనే అనుమానం కలుగుతోందని అన్నారు. ఏపీ ప్రతిపాదించిన ఎజెండాలో కాళేశ్వరం, చిన్న కాళేశ్వరం, చనాకాకొరటా, మోదికుంట వాగు, కడెం గూడెం లిఫ్ట్, సీతారామ లిఫ్ట్, చౌటుపల్లి హనుమంతరావు ప్రాజెక్టులతో పాటు సమ్మక్క బ్యారేజీకి సంబంధించిన అనుమతులను పునఃసమీక్షించాలని కోరడం తెలంగాణకు తీవ్ర అన్యాయమని విమర్శించారు. ఇప్పటికే కేసీఆర్ ప్రభుత్వం సాధించిన ప్రాజెక్టుల అనుమతులను రద్దు చేయాలని కోరడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. తెలంగాణ కోసం ఉద్యమం చేసి కేసీఆర్ ప్రభుత్వం 383 టీఎంసీల గోదావరి జలాలకు అనుమతులు సాధించిందని గుర్తుచేసిన హరీష్ రావు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడేళ్లలో ఒక్క కొత్త ప్రాజెక్టుకు కూడా అనుమతి తీసుకురాలేదని మండిపడ్డారు. రాష్ట్ర జలహక్కులను కాపాడడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, జీఆర్ఎంబీ సమావేశంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## జంతర్‌మంతర్‌ను టార్గెట్ చేసిన ఐఎస్ఐ..

# కుట్ర భగ్నం.. 9 మంది అరెస్ట్




**దశ, న్యూఢిల్లీ:** దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమాలను లక్ష్యంగా చేసుకుని విధ్వంసక చర్యలకు పాల్పడాలనే కుట్రను భద్రతా సంస్థలు భగ్నం చేశాయి. పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ మద్దతుతో పనిచేస్తున్నట్లు అనుమానిస్తున్న రెండు ఉగ్రవాద ముఠాలను అమృత్‌సర్ కమిషనరేట్ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు మైనర్లు సహా మొత్తం తొమ్మిది మందిని అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. పోలీసుల దర్యాప్తు ప్రకారం, నిందితుల్లో ఎనిమిది మంది జంతర్‌మంతర్ వద్ద జరుగుతున్న ఆందోళన ప్రాంతాన్ని సందర్శించి అక్కడ రెక్కీ నిర్వహించారు. పెట్రోల్ బాంబుల తయారీకి అవసరమైన సామగ్రిని సేకరించడంతో పాటు, స్థానికంగా కొంతమంది నుంచి లాజిస్టిక్ సహకారం కూడా పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కుట్ర వెనుక పాకిస్తాన్‌లోని ఐఎస్ఐ హ్యాండ్లర్ల ప్రమేయం ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. అమృత్‌సర్ పోలీస్ కమిషనర్ గుర్‌ప్రీత్ సింగ్ భుల్లర్ మాట్లాడుతూ, ఐఎస్ఐ మద్దతు గల రెండు ఉగ్రవాద ముఠాల నెట్‌వర్క్‌ను పూర్తిగా ఛేదించినట్లు తెలిపారు. ఒక ముఠా రైల్వే ట్రాక్‌ల వద్ద కెమెరాల అమర్చి, వాటి ఫీడ్‌ను సరిహద్దు దాటించి పంపేందుకు ప్రయత్నించిందని చెప్పారు. ఈ కార్యకలాపాలకు అవసరమైన నిధులు హవాలా మార్గంలో సమకూరినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. మరో ముఠాకు ఐఎస్ఐ హ్యాండ్లర్లు పెట్రోల్ బాంబుల తయారీ, వినియోగంపై శిక్షణ ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. పోలీసు, ఇతర భద్రతా బలగాలపై దాడులు చేసేందుకు ముందుగా రెక్కీ నిర్వహించాలని వారికి సూచించినట్లు వెల్లడించారు. అయితే భద్రతా సంస్థలు సకాలంలో అప్రమత్తం కావడంతో వారి ప్రణాళికలు అమలు కాకముందే కుట్రను భగ్నం చేసి నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ కేసులో ఇంకా లోతుగా దర్యాప్తు కొనసాగుతోందని, స్థానికంగా సహకరించిన వ్యక్తులతో పాటు ఈ కుట్రలో ప్రమేయం ఉన్న మరికొందరిని త్వరలో అరెస్టు చేసే అవకాశం ఉందని పోలీసులు వెల్లడించారు. దేశ భద్రతకు ముప్పు కలిగించే ఈ కుట్రను ముందుగానే అడ్డుకోవడం కీలక విజయంగా అధికారులు పేర్కొన్నారు.



## ఆర్టీఐలో 'అక్రమాలు లేవు'

# కళ్లముందు భారీ షెడ్లు!

**మొదటి పేజీ తరువాయి**

నేపథ్యంలో,అధికారిక రికార్డుల్లో అలాంటి వివరాలు లేవని పేర్కొనడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు సంబంధించిన వివరాలను ఉద్దేశపూర్వకంగా దాచిపెడుతున్నారా? లేక రికార్డుల నిర్వహణలో లోపాలున్నాయా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆర్టీఐ సమాధానంలో 2025 ఏప్రిల్ 1 నుంచి నిర్మాణ అనుమతుల బాధ్యత సంబంధిత అధికారికి బదిలీ అయినట్లు పేర్కొన్నప్పటికీ, అంతకుముందు నిర్మించిన భారీ షెడ్లకు అనుమతులు ఉన్నాయా? వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే అంశాలపై స్పష్టమైన సమాచారం ఇవ్వలేదు. గ్రామంలో కనిపిస్తున్న నిర్మాణాలకు సంబంధించి రికార్డుల్లో వివరాలు లేవని పేర్కొనడం అధికారుల పనితీరుపై సందేహాలకు తావిస్తోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రజలకు పారదర్శక సమాచారం అందించాల్సిన ఆర్టీఐ సమాధానాల్లో కూడా పూర్తి వివరాలు లేకపోవడంపై ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు ఆర్టీఐలో వచ్చిన సమాచారం, గ్రామపంచాయతీ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించి స్వతంత్ర విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజల ముందుంచాలని స్థానికులు కోరుతున్నారు. ఒకవేళ నిబంధనల ఉల్లంఘనలు లేదా అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# హైడ్రా చీఫ్ సంతకం ఫోర్జరీ

**మొదటి పేజీ తరువాయి**

హైందవి (బర్కత్‌పుర), ప్రియాం (మెహదీపట్నం), న్యూ ఎరా (చిక్కడపల్లి), మదర్స్ గర్ల్స్ (విద్యానగర్), షాహీన్ (శివరాంపల్లి), వశిష్ట (తెల్లాపూర్) జూనియర్ కాలేజీల పేర్లు వెలుగులోకి వచ్చాయి. విచారణ పూర్తైన తర్వాత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

### ఇంటర్ కాలేజీల ఫేక్ ఫైర్ NOCలపై విచారణ..


### విద్యార్థులు ఆందోళన చెందొద్దని ఇంటర్మీడియట్ బోర్డు భరోసా.

ఇంటర్మీడియట్ కాలేజీలకు ఫైర్ NOC (నో అబ్జెక్షన్ సర్టిఫికెట్) తప్పనిసరి చేసిన నేపథ్యంలో, కొన్ని కాలేజీలు సమర్పించిన ఫైర్ NOCలు నకిలీవని గుర్తించినట్లు ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి అభిలాష అభినవ్ వెల్లడించారు. ఇంటర్మీడియట్ బోర్డుకు అందిన ఫైర్ NOCలను హైడ్రా అధికారులతో పరిశీలించగా, కొన్ని సర్టిఫికెట్లు బోగస్‌గా ఉన్నట్లు తేలిందన్నారు. హైడ్రాకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇంటర్మీడియట్ బోర్డుకు అందడంతో ఈ నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం ఫేక్ NOCలపై సమగ్ర విచారణ కొనసాగుతోందని, దర్యాప్తు పూర్తయిన తర్వాత ఎన్ని కాలేజీలు నకిలీ సర్టిఫికెట్లు సమర్పించాయో స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. నకిలీ ఫైర్ NOCల వ్యవహారాన్ని హైడ్రా, ఇంటర్మీడియట్ బోర్డు అత్యంత సీరియస్‌గా తీసుకున్నాయని అభిలాష అభినవ్ తెలిపారు. ఈ అంశంపై బోర్డు స్థాయిలో అంతర్గత విచారణ కూడా కొనసాగుతోందని, నిబంధనలు ఉల్లంఘించిన కాలేజీలపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉందని స్పష్టం చేశారు. ఫేక్ NOCల వ్యవహారంతో విద్యార్థులు, తల్లిదండ్రులు భయపడాల్సిన అవసరం లేదని ఇంటర్మీడియట్ బోర్డు స్పష్టం చేసింది. విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కార్యదర్శి తెలిపారు. కాలేజీల అనుమతులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు సందేహాలు ఉంటే అక్కడే తనిఖీ చేసుకోవాలని సూచించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 3 వేలకుపైగా ఇంటర్మీడియట్ కాలేజీలకు అనుమతులు మంజూరైనట్లు ఇంటర్మీడియట్ బోర్డు వెల్లడించింది.

## FLNAT–NIOS పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: అదనపు కలెక్టర్ డా. కిరణ్మయి

**దశ, రంగారెడ్డి:** సెప్టెంబర్2026లో నిర్వహించనున్న FL NAT-NIOS పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. కిరణ్మయి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, జిల్లాలోని ఉల్లాస్ అభ్యాసకులందరూ పరీక్షకు హాజరై ఉత్తీర్ణులు అయ్యేలా ప్రత్యేక శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నమోదు, హాజరు, రవాణా, పరీక్షా కేంద్రాల నిర్వహణ తదితర అంశాల్లో సంబంధిత శాఖలు సమర్థవంతంగా పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో: జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, పీడీ మెప్మా వెంకట నారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శాంతిశ్రీ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.




## తెలంగాణకు ప్రాజెక్టులు.. బీజేపీలో కనిపించని సందడి

**దశ, హైదరాబాద్:** ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా నుంచి ప్రారంభించిన పలు జాతీయ ప్రాజెక్టుల్లో తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టులు కూడా ఉన్నప్పటికీ, రాష్ట్ర బీజేపీ నేతలు ఎలాంటి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించకపోవడం చర్చనీయాంశమైంది. మోదీ ప్రారంభించిన ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ నాలుగు లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేతో పాటు గ్రామీణ రహదారుల అభివృద్ధి పనులు తెలంగాణకు కూడా కీలకంగా మారనున్నాయి. ఈ ప్రాజెక్టును మూడేళ్లలో పూర్తి చేసి ఫ్యూచర్ సిటీతో అనుసంధానం చేయనున్నట్లు సమాచారం. అలాగే అనంతపురం, కర్నూలు సౌర విద్యుత్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణలోని అనుబంధ జిల్లాలకు కూడా ప్రయోజనం చేకూరనుంది. అయినప్పటికీ, ఈ ప్రాజెక్టుల ప్రారంభంపై తెలంగాణ బీజేపీ నాయకత్వం నుంచి పెద్దగా స్పందన లేకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది.

# దిల్‌సుఖ్‌నగర్‌లో నంబర్ ప్లేట్ లేని కారు కలకలం




### 'తెలంగాణ టైగర్' పేరుతో ఓవర్‌స్పీడ్‌లో దూసుకెళ్లిన హోండా సిటీ.. నిబంధనలపై ప్రశ్నలు

**దశ, హైదరాబాద్:** హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో నంబర్ ప్లేట్ లేకుండా, "తెలంగాణ టైగర్" పేరుతో సీఎం రేవంత్ రెడ్డి ఫొటో, పేరు ప్రదర్శించిన ఓ హోండా సిటీ కారు ఓవర్‌స్పీడ్‌తో తిరుగుతూ ప్రయాణికుల దృష్టిని ఆకర్షించింది. వాహనం వెనుక భాగంలో అడ్వకేట్ సింబల్ కూడా ఉండటం చర్చనీయాంశమైంది. నంబర్ ప్లేట్ లేకుండా వాహనం రోడ్డుపై ఎలా తిరుగుతోందని, ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ ప్రత్యేక అనుమతి ఇచ్చిందా అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. చలాన్లు, నిబంధనల ఉల్లంఘనలపై సాధారణ వాహనాలపై చర్యలు తీసుకునే అధికారులు ఈ ఘటనపై ఎలా స్పందిస్తారనే అంశంపై ఆసక్తి నెలకొంది.

## ఇన్సూరెన్స్ లేకపోతే

# పెట్రోల్, డీజిల్ బంద్?

**దశ, భువనేశ్వర్:** మోటార్ థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయించేందుకు సుప్రీంకోర్టు కీలక ప్రతిపాదనలు చేసింది. వాహనానికి చెల్లుబాటు అయ్యే బీమా ఉందో లేదో ధ్రువీకరించిన తర్వాతే పెట్రోల్, డీజిల్ సరఫరా చేసే విధానంపై పైలట్ ప్రాజెక్టును రూపొందించాలని కేంద్ర రోడ్డు రవాణా శాఖ, ఐఆర్డీఏఐను ఆదేశించింది. బీమా లేని వాహనాలకు అవసరమైన కవరేజీ పొందే వరకు ఇంధనం నిరాకరించే అవకాశాన్ని పరిశీలించాలని సూచించింది. అయితే, ఇది ప్రస్తుతం కేవలం పైలట్ ప్రాజెక్టు మాత్రమేనని, దేశవ్యాప్తంగా వెంటనే అమల్లోకి రాదని స్పష్టం చేసింది. అలాగే, ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ANPR) కెమెరాలను వాహన్, బీమా డేటాబేస్‌లతో అనుసంధానించి బీమా లేని వాహనాలను గుర్తించే విధానాన్ని అమలు చేయాలని సూచించింది. కొత్త ప్రైవేట్ కార్లకు థర్డ్‌పార్టీ బీమా గడువును మూడు నుంచి నాలుగు సంవత్సరాలకు, ద్విచక్ర వాహనాలకు ఐదు నుంచి ఆరు సంవత్సరాలకు పెంచాలని కూడా సుప్రీంకోర్టు ప్రతిపాదించింది.

## ర్యాపిడోలో పోలీస్ పెట్రోలింగ్ వాహనం

**మొదటి పేజీ తరువాయి**




పరిధిలోనిదా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. నంబర్ ప్లేట్ , వాహనంపై ఉన్న స్టిక్కరింగ్ ఆధారంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల పరిధిలోని పోలీసు ఉన్నతాధికారులు ప్రాథమికంగా పరిశీలిస్తున్నారు. సాంకేతికంగా యాప్‌లో డ్రైవర్ ఐడీ ఎలా రిజిస్టర్ అయింది, నిజంగానే పోలీస్ డ్రైవర్ ఈ పనికి ఒడిగట్టాడా లేక వాహనాన్ని ప్రైవేట్ వ్యక్తులు సర్వీసింగ్, మెయింటెనెన్స్ కోసం తీసుకెళ్లినప్పుడు ఇలా చేశారా అనే కోణంలో దర్యాప్తు సాగుతోంది.ప్రజా సేవల కోసం కేటాయించిన వాహనాన్ని వ్యాపార ప్రయోజనాలకు ఉపయోగించడం తీవ్రమైన నిబంధనల ఉల్లంఘన కిందకే వస్తుంది. ఈ ఘటనపై సంబంధిత జిల్లాల పోలీస్ కమిషనర్లు విచారణకు ఆదేశించినట్లు తెలుస్తోంది. వాహనంలో ఉన్న సిబ్బందిని లేదా వాహన బాధ్యత వహించే డ్రైవర్‌ను గుర్తించి, ఘటన వెనుక ఉన్న పూర్తి వాస్తవాలను త్వరలోనే అధికారికంగా వెల్లడించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు.

## ఎస్ఐఆర్‌కు 10 వరకు గడువు

### వెంటనే ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించండి: కలెక్టర్

**దశ , రంగారెడ్డి:** ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమానికి ఆగస్టు 10తో గడువు ముగియనున్న నేపథ్యంలో జిల్లాలోని అర్హులైన ప్రతి ఓటరు వెంటనే ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి సి. నారాయణరెడ్డి సూచించారు. ఇప్పటివరకు ఫారాలు సమర్పించని వారు చివరి రోజు వరకు వేచి చూడకుండా సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బీఎల్‌వో) ఫారాలు అందజేయాలని కోరారు. ఇప్పటికే ఓటరు జాబితాలో పేరు ఉన్నవారు కూడా పేరు, చిరునామా, వయస్సు తదితర వివరాలను పరిశీలించి అవసరమైతే సవరణలు చేయించుకోవాలని సూచించారు. జిల్లాలోని ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, బీఎల్‌వోలు ప్రజలకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.



# ఢిల్లీలో సీఎం రేవంత్

**మొదటి పేజీ తరువాయి**

పెద్దగా తేడా లేదని, ముంపులో ఎక్కువ భాగం నదీ గర్భంలోనే ఉంటుందని సీఎం వివరించారు. అందువల్ల మహారాష్ట్రతో చర్చించి ఎత్తు పెంపునకు అనుమతి కల్పించాలని కేంద్రాన్ని కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఇప్పటికే ఈ అంశంపై లేఖ అందిందని తెలిపారు. ముందుగా కేంద్ర జల సంఘం (CWC) ఆధ్వర్యంలో తెలంగాణ, మహారాష్ట్ర అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చలు ప్రారంభిస్తామని, అనంతరం ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ మంత్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశాల్లో ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, డాక్టర్ మల్లు రవి, రామసహాయం రఘురాంరెడ్డి, పోరిక బలరాం నాయక్, గడ్డం వంశీకృష్ణ, డాక్టర్ కడియం కావ్య, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ ఈ. శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో 18 శాతానికి తగ్గిన వర్షపాతం లోటు..

**దశ, హైదరాబాద్:** గత వారం రోజులుగా కురుస్తున్న విస్తారమైన వర్షాలతో హైదరాబాద్ నగరానికి గణనీయమైన ఊరట లభించింది. వారం క్రితం 34 శాతంగా ఉన్న వర్షపాత లోటు ప్రస్తుతం 18 శాతానికి తగ్గింది. ప్రస్తుత రుతుపవనాల సీజన్‌లో ఇప్పటివరకు సాధారణంగా 297.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 245 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక సంస్థ (టీజీడీపీఎస్) గణాంకాలు వెల్లడిస్తున్నాయి.అయితే, నగరంలోని అన్ని ప్రాంతాల్లో వర్షపాతం ఒకే రీతిలో లేదు. తిరుమలగిరిలో 45 శాతం, సైదాబాద్‌లో 35 శాతం, మారేడ్‌పల్లిలో 31 శాతం, అంబర్‌పేటలో 27 శాతం, నాంపల్లి, చార్మినార్‌లలో 26 శాతం చొప్పున అత్యధిక లోటు నమోదైంది.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com